# లయావస్థ అనంతర ప్రయాణం

## నీరు తాను గతంలో హైడ్రోజన్ అనే విషయం మరచిపోయినప్పుడు



పూజ్య దాజీ

70వ జన్మదిన సందర్భంగా ఇచ్చిన సందేశం

సెప్టెంబర్ 28, 2025, కాన్హా శాంతి వనం

# లయావస్థ అనంతర ప్రయాణం

## నీరు తాను గతంలో హైడ్రోజన్ అనే విషయం మరచిపోయినప్పుడు

ప్రియతములారా,

చాలామంది ముక్తి లేదా నిర్వాణాన్నే ఆధ్యాత్మిక వికాసంలో పరమావధి అని విశ్వసిస్తారు. అంటే లోభం, ద్వేషం, అహంకారం, అజ్ఞానం అనబడే అగ్నులను ఆర్పి వేయడం అన్నమాట. వేదన మరియు మరణాలనే చక్రానికి అది ముగింపు. అదే అంతిమ ముక్త స్థితి.

అనంతరం కబీర్ సాహెబ్ చెప్పిన దాని ఆధారంగా, మన అహం క్రమంగా తగ్గడం అనేది నేర్చుకున్నపుడు, లయావస్థను కొద్దిగా అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాం. కబీర్ సాహెబ్ లయావస్థనేది చాలా సులువు అనిపిస్తారు. “లయావస్థ అంటే వర్షపు చినుకులు సముద్రంలో పడినట్లు ఉంటుంది” అని అంటారాయన. తాను సముద్రమవడం ఎలా ఉంటుందో వర్ణించేందుకు ఏ చినుకూ మిగలదు.

అయితే "మీరు లయావస్థను సాధించినప్పుడు మాత్రమే మిమ్మల్ని 'ప్రారంభకులు' అని పిలవవచ్చు" అంటూ బాబూజీ మహరాజ్ చేసిన దిగ్భ్రాంతి గొలిపే ప్రకటన, మనం ఇప్పటివరకు తెలుసుకున్నామని అనుకున్నదాన్నంతా తలక్రిందులు చేసేసింది. మనం మార్గాంతమని అనుకున్నది నిజానికి మనల్ని అసలైన ప్రయాణానికి సిద్ధం చేస్తున్న ప్రారంభం అన్నమాట!

మరో విధంగా చెప్పాలంటే ఒక సంగీత కళాకారుడు తన వాయిద్య పరికరాన్ని వాయించడం నేర్చుకునేందుకై సంవత్సరాల తరబడి కృషి చేస్తాడు. అతనికి దానిపై పూర్తి ఆధిపత్యం వచ్చినప్పుడే, తనకు తన సంగీతానికి మధ్య ఏ తేడా లేనప్పుడే, అతను నిజంగా సృష్టించడం ప్రారంభిస్తాడు. సాంకేతిక నైపుణ్యాలు స్వచ్ఛమైన అభివ్యక్తీకరణకు దారితీస్తాయి.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే సంగీతకారుడు, సంగీతం ఒకటయ్యే ఆ ఏకత్వాన్ని అధిగమించి అక్కడ ఇంకేం ఉంటుంది? నిశ్శబ్దం! – అందులోంచే అన్ని సంగీతాలు జనించి తిరిగి అన్నీ ఆ నిశ్శబ్దంలోనే లయమవుతాయి. కేవలం శూన్యం నిండిన నిశ్శబ్దం కాదది. అది అన్ని రకాల మధుర రాగాలతో కూడిన నిశ్శబ్దం. స్వరాల మధ్య ఉన్న విరామాలలోనే శక్తివంతమైన సంగీతం వ్యక్తం అవుతుందని గొప్ప సంగీత విద్వాంసునికి తెలుసు.



"మీరు లయావస్థను సాధించినప్పుడు మాత్రమే మిమ్మల్ని 'ప్రారంభకులు' అని పిలవవచ్చు"

– బాబూజీ

ఇప్పుడు లయావస్థ గురించి, అలాగే దాన్ని అధిగమించిన తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం!

మొదటగా దాన్ని ఎవరు ఆశిస్తున్నా రనేది, అలాగే అన్వేషణ ముగిసిందని తెలుసుకునేందుకు ఎవరు మిగిలి ఉంటారనేది మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక బిందువు 'నేను సముద్రమయ్యాను' అని ప్రకటించినప్పుడు లయావస్థ ఇంకా జరగలేదని తెలుస్తుంది. నిజమైన లయావస్థలో ప్రకటించేందుకు 'నేను' అనేది మిగిలి ఉండదు. అలాగే తాను లయం చెందే క్రమంలో, సముద్రంలో పడిపోయే సమయంలో చూసే సాక్షి కూడా మిగలడు. 'నేనిప్పుడు సముద్రాన్ని' అని బిందువు అనలేదు. ఎందుకంటే అనగలిగే ఆ 'నేను' అక్కడిక ఎంతమాత్రమూ లేదు. ఇది మనకు తెలిసిన సాధారణ మరణం కాదు; ఇది అతి పెద్ద పరివర్తనం. మరణం శాశ్వతమైన జీవితానికి కూడా దారితీయగలదు.

ఒక నిమిషం ఆగి దీన్ని గురించి ఆలోచించండి: “సముద్రత్వాన్ని అనుభూతి చెందేదెవరు?” అని అడిగిన ఆ బిందువు అక్కడ ఇక లేదు. “దావాగ్నిలో కలిసిపోయిన కొవ్వొత్తి జ్వాల ఇప్పుడేం ఆలోచిస్తుంది?” అని అడిగినట్లే ఉంటుంది. ఈ ప్రశ్న ఇక ఏమాత్రమూ జీవించిలేని ఒక ఆలోచనాకర్త ఉన్నాడని ఊహించినట్లు ఉంది.

ప్రకృతి ఈ అద్భుత రహస్యాన్ని అతి సాధారణమైన విషయాల ద్వారా మనకు చూపుతుంది. హైడ్రోజన్ నే తీసుకోండి: అది పేలిపోవచ్చు, అది ప్రమాదకరమైనది, వెంటనే మండే గుణం కలది. ఆక్సిజన్ ప్రతి మంటనూ రగుల్కొలిపి, దాన్ని త్వరగా మండేలా చేస్తుంది. విడివిడిగా చూస్తే అవి రెండూ ప్రమాద కారకాలే. అయితే సరైన రీతిలో రెండూ కలిస్తే ఏమవుతుంది? – నీరు! అన్నింటి మనుగడ కొనసాగింపజేసే ప్రాణాధార వస్తువు.

ఇది చూడండి: హైడ్రోజన్ కు ఏమైంది? ఆక్సిజన్ ఎక్కడుంది? అవి నశించిపోలేదు. కానీ అవి తమ తమ రూపాల నుండి తామే ఊహించలేని ఒక  కొత్త పదార్థంగా రూపొందాయి. హైడ్రోజన్ 'ఇప్పుడు నేను నీరుగా మారాను' అని అనలేదు. ఎందుకంటే, అలా అనేందుకు తన పూర్వ స్వచ్ఛమైన హైడ్రోజన్ రూపంలో అది లేదు. ఆ రెండు అసలైన మూలకాలకి వేరుగా, భిన్న ప్రయోజనాన్ని నెరవేర్చే ఒక క్రొత్త వాస్తవికత రూపుదాల్చింది.

అలాగే క్లోరిన్, సోడియంలు చేయగలిగే అద్భుతాలను చూడండి! క్లోరిన్ యుద్ధాల్లో వినియోగించే ఒక విష వాయువు. సోడియం నీటిని తాకగానే పేలిపోతుంది. మరి ఇవి రెండు కలిసినప్పుడు సాధారణ ఉప్పు తయారౌతుంది. ఇది మన శరీర కణాలకు ఎంతో అవసరం. ప్రాణాంతకమైనది అవసరమైనదిగానూ విషపూరితమైనదేమో సురక్షితంగానూ తయారైంది.

సాగరంలో సంగమించే నది, సముద్రంలో పడే వర్షపు చినుకులు మరియు ఆక్సిజనుతో కలిసే హైడ్రోజన్, ఇవన్నీ కూడా మనకు ఒకే విషయాన్ని, కలిసిపోవడంలో ఉన్న ప్రయోజనం గురించి చెబుతున్నాయి. లయము అంటే కేవలం రెండు పదార్థాలు కలవడమే కాదు, అది ఎక్కువ అర్థవంతమైన, పూర్తి నూతనమైనదాన్ని తయారుచేయడం కూడా! ఒక గొప్ప ప్రయోజనానికై అందరికీ ఉపయోగపడే కొత్తదాన్ని కనుగొనడం కోసం పాత అస్తిత్వాలను వదిలివేయడం అన్నమాట.

- **మహత్తరమైన కారణం కోసం తనను తాను వదలుకోవడం:** ఇది, ఒకటి మరొకదాన్ని స్వాధీనపరచుకోవడం గురించి కాదు. రెండు అస్తిత్వాలు కూడా తమను తాము కోల్పోయి ఉన్నతమైన ఒక కొత్తదానిలో కలిసిపోవడం గురించి. మీకు సంతృప్తానుభూతిని కలిగించే ఏదో ఒక దాన్ని వదలుకున్నట్లుగా దీనిని భావించండి.

- **స్థితిలో మార్పు, కేవలం కలయిక కాదు:** సాధారణ లయమంటే రెండు విభిన్న రంగులను కలిపితే ఒక కొత్త రంగు ఏర్పడటం. మరో పక్క అతీతమైన లయము అంటే రెండు వస్తువులు కలిసి, ఏకమై పూర్తిగా ఒక నూతన పదార్థం – ఎలాగైతే హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసి నీరు తయారవుతుందో – అలా ఏర్పడటంవంటిది. అవి కేవలం 'కలిసిపోవు' – పూర్తిగా మారిపోతాయి.

- **అనూహ్య ఫలితం:** అసలు అస్తిత్వాలు తమంతట తాము చేయలేని పనులను లయావస్థ అనంతరం ఏర్పడిన కొత్త అస్తిత్వం చేయగలదు. ఈ క్రొత్త అస్తిత్వానికి లయావస్థకు ముందులేని క్రొత్త సామర్థ్యాలు, క్రొత్త మనసు, క్రొత్త లక్ష్యం అనేవి ఉంటాయి.

లయావస్థ అనేది కేవలం ప్రారంభం అని బాబూజీ అన్నప్పుడు, ఎందరో విస్తుపోయారు, కంగుతిన్నారు. వాళ్లు ఆయనను "మాస్టర్! లయావస్థ అనేది అంతిమం కానప్పుడు దాని తర్వాత ఏమి వస్తుంది?" అని అడిగారు.

**అతీతమైన లయము అంటే రెండు వస్తువులు కలిసి, ఏకమై పూర్తిగా ఒక నూతన పదార్థం – ఎలాగైతే హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసి నీరు తయారవుతుందో – అలా ఏర్పడటంవంటిది. అవి కేవలం 'కలిసిపోవు'– పూర్తిగా మారిపోతాయి.**



అనుభవం ద్వారా నేను నేర్చుకున్నది ఈ విధంగా ఉంది:

ఒక నదిని, చేతులు సాచి సముద్రం స్వాగతించినట్లు మొదటగా లయావస్థ వస్తుంది. నదికి తాను నదిని అనే జ్ఞాపకం లీలగానైనా ఇక్కడ ఉంటుంది. నది యొక్క ఈ చలనాన్ని ఇప్పుడు సముద్రమున్న లోకంలోకి అరుదెంచినట్లుగా పరిగణించండి. ఇది సాలోక్యత.

అనంతరం మనం పరిణతి చెందే క్రమంలో సారూప్యంగా తయారై, తాను వేరుగా ఉన్నాను అనే జ్ఞాపకం సైతం చెరిగిపోతుంది. సోడియంకు తాను సోడియం అని ఇక ఏమాత్రం గుర్తుండదు. అది కేవలం ఉప్పు మాత్రమే; తన పాత ప్రేలుడు స్వభావం వైపు వెళ్లాలని అది కోరుకోదు.

అయితే ఇది సామీప్యత అనుకునేందుకు సరిపోదు. ఈ దశలో మన వ్యక్తిగత సంకల్పం అంతరించిపోయి, దైవ సంకల్పం ఏ ఆటంకమూ లేకుండా, ప్రవహిస్తున్నానే ఎరుక కూడా లేకుండా, మాధ్యమం ద్వారా ప్రవహిస్తుంది. అది దేన్నీ పక్కకు నెట్టివేయదు. ఆకాశంలా అన్నింటినీ పట్టి ఉంచుతుంది.

ఇంకా దానికి మించితే... ఇక్కడ పదాలు న్యాయం చేయలేవు. హైడ్రోజన్, ఆక్సిజన్ లకు, జీవులను సంరక్షించడం అంటే ఏమిటో నీరు వివరించగలదా? అలాగే సోడియం, క్లోరిన్ లకు, ఆహారాన్ని తాజాగా ఉంచడం, రక్త సమతుల్యతను నిలబెట్టడం తనకు ఎంత ఆనందాన్ని ఇస్తుందో ఉప్పు వివరించగలదా?

పాశ్చాత్య తత్వశాస్త్రం 'శూన్యాన్ని' ఒక భయం గొలిపే శూన్యత్వమని అంటుంది. అయితే అది అత్యంత గతిశీలకం అని మనకు తెలుసు. హైడ్రోజన్, ఆక్సిజన్ లు కలిసి నీటిని తయారు చేసినపుడు అవి శూన్యంగా మారిపోయాయా? లేదు!

అవి మొత్తం పర్యావరణ వ్యవస్థనే కాపాడగలవు. లయావస్థ అనంతరం ఉండే అహంకార రాహిత్యం అలా అనిపిస్తుంది. అది ఖాళీ కాదు; ఇక వెల్లడించవలసిన అవసరమే లేనంతగా అది నిండిపోయి ఉంది.

లయావస్థను దాటి సాక్షాత్కారం పొందిన వ్యక్తి 'నేను జ్ఞానోదయం పొందాను' అని తిరుగుతూ ప్రకటించుకోడు. నీటికి "నేను $H_2O$ ని" అని చెప్పాల్సిన అవసరం లేదు. అది ప్రవహిస్తుంది, పోషిస్తుంది, శుభ్రం చేస్తుంది, ఆధారాన్నిస్తుంది. దాని కేవల అస్తిత్వమే దాని ప్రకటన.

**లయావస్థను దాటి సాక్షాత్కారం పొందిన వ్యక్తి 'నేను జ్ఞానోదయం పొందాను' అని తిరుగుతూ ప్రకటించుకోడు. నీటికి "నేను $H_2O$ ని" అని చెప్పాల్సిన అవసరం లేదు. అది ప్రవహిస్తుంది, పోషిస్తుంది, శుభ్రం చేస్తుంది, ఆధారాన్నిస్తుంది. దాని కేవల అస్తిత్వమే దాని ప్రకటన.**

ఇప్పుడు దీని గురించి ఆలోచించండి: సముద్రంగా తయారవడం లక్ష్యం కారాదు. మీరు ఎన్నడూ బిందువు కాదని గ్రహించడమే అసలు విషయం. మీరు ఎప్పుడూ తననొక బిందువుగా భావిస్తూ ఉండిన సముద్రమే! అయితే ఈ జ్ఞానం అంతిమం కాదు. ఇది అసలైన పనికి ఆరంభం మాత్రమే.

మీరు సముద్రమని గ్రహించిన తర్వాత తిరిగి బిందువుగా ఎలా ఎరుకతో కూడి కలలు కనాలో నేర్చుకోవలసిన అవసరం ఉంది. ఈసారి అలా భావించడం పరమజ్ఞానం కలిగి ఉన్నందునే గానీ అజ్ఞానం వల్ల కాదు. ఇదే విముక్తాత్మను, బంధింపబడిన ఆత్మ నుండి వేరు చేస్తుంది. చూసినది నిజమని ఒకరు నమ్ముతుండగా, మరొకరు ఇతరులు కలలు కనేందుకై కావాలనే ఒక ప్రయోజనార్థం తన పాత్ర పోషిస్తారు. “నేను సంభాషించే సమయంలో మాట్లాడుతోంది లాలాజీనా, నేనా లేక ఇతరులెవరైనానా? అని ఎప్పుడూ ఆశ్చర్యపోతాను.” అని బాబూజీ అనేవారు. దీనంతటి నుండి మనకు ఖచ్చితంగా అర్థమయ్యేది ఏమిటంటే, మన ‘నేను’ లేదా ‘అహం’ అనేది అక్కడ మాయమైపోతుంది.

“ఇవన్నీ గొప్ప ఆలోచనలే కానీ నేను ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ లను, సమస్యలను ఎదుర్కోవాల్సిందే కదా!” అని మీరనుకొంటూ ఉండవచ్చు. అదీ విషయం! సముద్రం ప్రతి బిందువుగా తన్ను తాను అనుభూతి చెందడం నేర్చుకోవాలి.



సముద్రంగా తయారవడం లక్ష్యం కారాదు. మీరు ఎన్నడూ బిందువు కాదని గ్రహించడమే అసలు విషయం. మీరు ఎప్పుడూ తననొక బిందువుగా భావిస్తూ ఉండిన సముద్రమే! అయితే ఈ జ్ఞానం అంతిమం కాదు. ఇది అసలైన పనికి ఆరంభం మాత్రమే.

మన జన్మకు గల పరిమితులను ఎరుకలో ఉంచుకుంటూనే, పరిమితులులేని మూలంతో సంధానమై ఉండాలి.

"కానీ దాజీ! నిజ జీవితంలో దాన్ని ఎలా చేయగలం?" అని మీరు అడగవచ్చు.

నీటి వలే ఉండండి. ఎవరికి సహాయం చేయాలో నీరు ఎంచుకోదు. 'నేను స్వర్ణ వాహికల్లో మాత్రమే ప్రవహిస్తాను' అని అది చెప్పదు. అది ఒకేలా ఉంటూనే ప్రతి పాత్రకు అనుగుణంగా తన్ను తాను మార్చుకుంటుంది. వేడి చేసినప్పుడు ఎలాంటి సమస్య లేకుండా ఆవిరిగా మారుతుంది. అదే చల్లబరిస్తే సులభంగా గడ్డ కడుతుంది. అయితే ఇలా మార్పులు చెందుతున్నప్పటికీ, తను వాస్తవానికి జీవాన్ని కొనసాగించే శక్తిని, అన్న విషయాన్ని అది మర్చిపోదు.

ఎల్లప్పుడూ సోడియం మీకు నేర్పిన పాఠాన్ని గుర్తుంచుకోండి. జీవానికి అవసరమైన నీరు సైతం తప్పుడు మూలకంతో జత కూడినప్పుడు ప్రమాదకరమవుతుంది. ఆధ్యాత్మిక యాత్రకి నీటివంటి మృదుస్వభావం తోబాటు, మనం మారడం కోసం సహాయపడే సరైన వ్యక్తిని ఎన్నుకునే విజ్ఞత కూడా ఆవశ్యకం. వివాహం విషయంలో కూడా ఇదే నియమం వర్తిస్తుంది. సోడియం క్లోరిన్ తో జతకలవకుండా నీటితో కలిస్తే ఏమవుతుందో ఊహించండి! బూమ్... అంటూ పేలుడు.

**ఎవరికి సహాయం చేయాలో నీరు ఎంచుకోదు. 'నేను స్వర్ణ వాహికల్లో మాత్రమే ప్రవహిస్తాను' అని అది చెప్పదు. అది ఒకేలా ఉంటూనే ప్రతి పాత్రకు అనుగుణంగా తన్ను తాను మార్చుకుంటుంది.**



**ఆధ్యాత్మిక యాత్రకి నీటివంటి మృదుస్వభావం తోబాటు, మనం మారడం కోసం సహాయపడే సరైన వ్యక్తిని ఎన్నుకునే విజ్ఞత కూడా ఆవశ్యకం.**

లయావస్థ అనంతరం ఏమవుతుంది? నీటికి అతీతంగా ఉన్న అవే విషయాలు, నీరు వేటి వేటిగా మారగలదో, ఏయే అద్భుతాలు చేయగలదో అవన్నీ జరుగుతాయి. ఊపిరి బిగబట్టి మీరు చూసే అద్భుతమైన మంచు శిల్పాల నుండి, సమున్నత యంత్రాలను నడిపే ఆవిరిగా, ఎండిపోయిన భూములకు నీటిని ఇచ్చే మేఘాలుగా, విస్తారమైన లోయలను చెక్కి ప్రవహించే నదులుగా, నిండు సూర్యుని ప్రతిబింబించే తుషార బిందువులుగా, ఇలా ఎన్నిటిగానో నీరు మారుతుంది.

లయావస్థ అనంతరం ఏర్పడే ఆ ఖాళీలో ఎన్నో జరుగవచ్చు. కలవక ముందు అవి హైడ్రోజన్, ఆక్సిజన్ మాత్రమే! అయితే కలిశాక గతంలోని, భవిష్యత్తులో ఉండబోయే అనంతమైన నీటిని కూడా అవి సృష్టించగలవు. ఒక వాద్య గోష్ఠి ప్రారంభం కాబోతుంది.. ఆ గోష్ఠిలో ప్రతి మధుర రాగాన్నీ వాయించడం సాధ్యమే.

రెండు మహాశూన్యాలు కలిసినప్పుడు ఏమవుతుంది? దీనికి తార్కికమైన జవాబు అక్కడ శూన్యమే ఉంటుంది అని. కానీ ఈ శూన్యం అనేది సున్నాతో సమానం కాదు. గణితంలో అనంతం అనే భావన ఏం చెబుతుందంటే అనంతం + అనంతం = అనంతమే అవుతుంది, కానీ 'రెండు అనంతాలు' కాదు.

అయితే గణిత శాస్త్రవేత్తలు అనంతంలో భిన్న పరిణామాలు ఉన్నాయి అని కనుగొన్నప్పుడు వారు ఒక లోతైన ఆధ్యాత్మిక సత్యాన్ని స్పృశించారు. లయావస్థ అనంతరం అనంతమైన విషయాలు ఉండడమే కాక, అనంతమైన అనంతాలు కూడా ఉంటాయి. అంటే ప్రతి అనంతం భిన్నంగా ఉంటూ ఇతర అన్ని అనంతాలనూ కలిగి ఉంటుంది. అందుకే లయావస్థ తర్వాత యాత్ర అనేది ఎన్నటికీ ముగియదు.

మీతో నేను చెప్పదలుచుకున్నది ఇదే! బిందువు, సింధువు అవ్వదు. అది ఎప్పటి నుండో కూడా తాను సముద్రమేనని తెలుసుకుంటుంది. అయితే ఈ ఆవిష్కరణ అనంత విశ్వవిద్యాలయంలో మొదటి రోజు పాఠం వినడం వంటిది మాత్రమే. మరి దానికి ఆవల ఏముంది?

అతీతమైన దానికి అతీతంగా వెళ్లగలిగిన వ్యక్తి దీన్ని మీకు చెప్పగలరు. వారు వెనుకకు తిరిగివచ్చినప్పుడు, మౌనమే మాటలకన్నా బలంగా సంభాషిస్తుందని, బోధనకన్నా, అక్కడ ఉండడమే ఎక్కువ నేర్పుతుందని, నిజమైన శక్తి అనేది అసలు ఎలాంటి శక్తి లేకపోవడమేనని గ్రహిస్తారు. అది కేవలం ప్రేమ. హైడ్రోజన్, ఆక్సిజన్ పరస్పరం లయం చెంది తిరిగి జీవ రూపంలో పునర్జన్మించే ఒక విధమైన శాశ్వత క్రీడ అని గ్రహిస్తారు.

విషయాలను విడగొట్టడంలోని మాయాజాలం ఇదే! మార్గాన్ని అధిగమించి ముందుకు సాగే మార్గం ఇదే! ఈ కారణం చేతనే మీరు “లయావస్థ అనంతరం ఏం జరుగుతుంది?” అని అడిగినప్పుడు నేను కేవలం చిరునవ్వు నవ్వగలను. మీరేమీ చెప్పాల్సిన అవసరం లేదు. మీరే సమాధానంగా మారాల్సిన అవసరం ఉంది.

లయావస్థ అనంతరం అనంతమైన విషయాలు ఉండడమే కాక, అనంతమైన అనంతాలు కూడా ఉంటాయి. అంటే ప్రతి అనంతం భిన్నంగా ఉంటూ ఇతర అన్ని అనంతాలనూ కలిగి ఉంటుంది. అందుకే లయావస్థ తర్వాత యాత్ర అనేది ఎన్నటికీ ముగియదు.

అలా తయారైనప్పుడు మాస్టర్స్ ఎందుకు ఏమీ చెప్పరో మీరు అర్థం చేసుకోగలుగుతారు. వారు మీకు కేవలం ఒక గ్లాసు నీటిని అందిస్తారు. అది ఎంత అద్భుతంగా ఉంటుందో స్వయంగా మీరే గ్రహించేవరకు వారు ఎదురు చూస్తారు. మీరు ఆ గ్లాసు నీటిని పట్టుకున్నప్పుడు, హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసి ఇంకేదోగా ఎలా రూపాంతరం చెందుతున్నాయనే దానిపై ఆలోచించండి. తన పరిశుద్ధతకు అచ్చెరువొందే సముద్రమూ మీరే! తన స్వీయ క్రీడకై నెమ్మదిగా మేలుకుంటున్న దివ్యత్వమూ మీరే!

ఆ జ్ఞాపకంలో ఒక మహాద్భుతమే సంభవిస్తుంది. సాధారణమైనది పవిత్రమవుతుంది. ఏదోగా మారడం వల్ల కాదు, అది ఎల్లప్పుడూ ఏదిగా ఉందో దానిగానే చూడబడడం వల్ల అలా జరుగుతుంది.

అన్ని లయావస్థలకు అతీతంగా, ఆ సర్వోన్నత మౌనంలో ఆయన మనకు సరైన మార్గాన్ని ఎంచుకునే విజ్ఞతను ప్రసాదించుగాక!

దివ్య గురుదేవులకు ప్రార్థనలతో,
కమలేష్

# Notes

